# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 10-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆఫ్రికాను ముడి పదార్థాల వనరుగా కాకుండా, స్థిరమైన వృద్ధికి దోహదపడే ప్రాంతంగా చూడాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించనుంది.**

**4.** **కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

**5.** **ప్రజల అవసరాల దృష్ట్యా జలవనరుల శాఖలో చేపట్టిన 71 పనులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

==========================

ఆఫ్రికాను ముడి పదార్థాల వనరుగా కాకుండా, స్థిరమైన వృద్ధికి దోహదపడే ప్రాంతంగా చూడాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నమీబియా పార్లమెంటును ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. ఆఫ్రికా పారిశ్రామికీకరణ లక్ష్యాలకు భారత్ మద్దతు అందిస్తుందని తెలిపారు. స్థానిక నైపుణ్యాలను పెంపొందించడం, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భారత్ ఆఫ్రికాకు సహకారం అందిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్, పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చదువు, పురోగతి, సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తారు. అలాగే విద్యార్థుల చదువులకు సంబంధించిన సమగ్ర పురోగతి కార్డులను తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించనుంది.

శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారు. అలాగే ఆయా జిల్లాల్లో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

---------------------------

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా గురు పౌర్ణమి సందర్భంగా పుట్టపర్తి లోని శ్రీ సత్య సాయి నిలయంలో జరిగే వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై రాష్ట్రంలో పంటల సాగు, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తర్వాత స్థానిక రైతులతోపాటు స్వయం సహాయక సంఘాల మహిళలతోనూ సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

---------------------------

కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 'కృష్ణా, గోదావరి నదీ జలాలు : వినియోగం : వివాదాలు' అంశంపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో ముఖ్యమంత్రి నిన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, నదీ జలాల కేటాయింపుల్లో తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వ చర్యలపై విధాన పత్రాన్ని రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర నీటి ప్రయోజనాలను పరిరక్షించుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ప్రజలకు ప్రభుత్వం అందించే సేవల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోందని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నాటికి.. 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ప్రజలకు ఆన్ లైన్ లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజ్ చేయడం ద్వారా వారికి కావాల్సిన వైద్య సేవలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

ప్రజల అవసరాల దృష్ట్యా జలవనరుల శాఖలో చేపట్టిన 71 పనులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్నసమావేశమైన మంత్రి మండలి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వివరించారు. అమరావతిలోని నేలపాడులో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌ల నివాస సముదాయాల పనులు పూర్తిచేయాలని ఈ మేరకు మంత్రిమండలి

నిర్ణయించిందని మంత్రి తెలిజేయజేస్తూ,

వాయిస్..35 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిషన్‌రావ్ బాగ్డే నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి బాబా సమాధిని దర్శించుకుని నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సత్యసాయి బాబా సామాజిక అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. ఆయన సేవలు అందరికీ ఆదర్శనీయమని తెలిపారు.

-----------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పు, రాజీవ్ యువ వికాస పథకం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, మౌలిక సదుపాయాల కల్పన, మాదక ద్రవ్యాల నియంత్రణ, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

-----------------------------

దీర్ఘకాలిక అనారోగ్యాల కారణంగా ప్రతియేటా ప్రతి పది మందిలో ఏడుగురు మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, ఉబ్బసం, గుండె జబ్బులతో సహా అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 10వ తేదీన దీర్ఘకాలిక వ్యాధుల అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల వల్ల సంభవించే మరణాల శాతం తగ్గించడానికి, నయం కాని వ్యాధులకు చికిత్స చేయడానికి, మరిన్ని వనరులను సమయాన్ని కేటాయించాల్సిన అవసరాన్ని తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కాగా దీర్ఘకాలిక వ్యాధుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

-----------------------------

గురు పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ రోజు జరుపుకుంటున్నారు. ఆషాఢ మాస పూర్ణిమను “గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి” అని పిలుస్తారు. పవిత్రమైన ఈ రోజున ప్రజలు తమ జీవితానికి మార్గనిర్దేశం చేసిన తల్లిదండ్రులు, గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకుంటారు. మహాభారతాన్ని రచించిన, ఆది గురువుగా పేరు గాంచిన వేద వ్యాసుడు జన్మించినది కూడా ఆషాఢ పౌర్ణమి అయినందున ఈ రోజును వ్యాస పౌర్ణమి అని వ్యవహరిస్తున్నారు.

-----------------------------

ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ మైదానం వేదికగా 3వ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ఈ రోజు ప్రారంభం కానుంది. భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఇప్పటికే 1–1తో సమంగా ఉండడంతో.. లార్డ్స్‌లో జరిగే టెస్టులో గెలిచి ఆధిక్యం పెంచుకోవాలనే లక్ష్యంతో ఇరు జట్లు పోటీపడనున్నాయి.

ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఈ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్…18 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================